# ఒక సిటీబస్ లేక బోలెడుప్రాణాలకథ

అనగా అనగా జంబూద్వీపంలో భరత ఖండంలో అంధ సిటీ అనే నగరం వుండేది.

అంధ సిటీలో అన్యాయాలు, అక్రమాలు ఎక్కువైపోయి పాపం పెరిగిపోసాగింది. పాపులు చిరాయువులై వర్ధిల్లడం వల్ల భూభారం పెరిగిపోసాగింది.

సృష్టికర్త అయిన బ్రహ్మ ఎంత తక్కువగా మనుషుల్ని తయారు చేసినా, భూలోకంలో ఎంత బలాత్కారంగా కుటుంబ

## స్వగతంబు

నియంత్రణ ఆపరేషన్లు చేసినా భూభారం పెరగడం మానలేదు.

లయకారుడైన పరమశివుడు ఎన్ని వుప్పెనలు, కొత్తరకం జబ్బులు కల్పించినా జనం కిక్కిరిసిపోసాగారు.

ఇక లాభం లేదని శ్రీమన్నారాయణుడు పరిష్కారమార్గం చర్చించడానికి నారదుడ్ని కబురుపెట్టి రప్పించాడు. సిండికేట్ మీటింగ్‌లా వాళ్ళిద్దరూ ఏవో మంతనాలాడి ఒక నిర్ణయానికి వచ్చారు.

పర్యవసానంగా—కొన్నేళ్ళుగా ఘోర తపస్సు చేస్తున్న బస్సాసురుడు అనే పరమ భక్తునికి విష్ణుమూర్తి ప్రత్యక్షమై వరం ప్రసాదించాడు. విష్ణుమూర్తి స్వయంగా తన విష్ణుచక్రాన్ని రథంగా మార్చి తన భక్తుడు బస్సాసురుడికిస్తూ "ఈ రథానికి తిరుగులేదు. ఎవరు అడ్డొచ్చినా సరే పచ్చడైపోతారు. ఎన్ని ప్రాణాలు పోయినా నీకు పాపం రాదు పుణ్యమే అవుతుంది. ఎన్ని ప్రాణాలు తీసినా నిన్ను అడిగే వాడుండడు. ఇదే నా వరం" అని చెప్పి దీవించి మాయమైపోయాడు.

మర్నాటినుండి కారణజన్ముడైన బస్సాసురుడు నిమిత్త మాత్రునిలా భూభారాన్ని తగ్గించసాగాడు. ప్రతీరోజు బస్సాసురుడి రథంకిందపడి ఎందరో అమాయకప్రజలు ప్రాణాలు పోగొట్టుకోసాగారు. "పోయిన వాళ్ళందరూ పరమాత్ముడిలో లీనమయారు. మనం విచారించకూడదు. సంతోషించాలి" అంటూ భక్త నాయకులు, భక్తఅధికారులు ప్రజలకి నచ్చచెప్పసాగారు.

"అవును కాబోలు" అనుకుని వెర్రి ప్రజలు బస్సాసురుడి రథంకింద వేలం వెర్రిగా పడి వేల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోడం ప్రారంభించారు.

భూభారం చాలా వరకూ తగ్గినా కొంత మిగిలిపోయింది.

కొందరు వుద్యమాలులేని నాయకులు తమ నాయకత్వం పెంచుకోడానికి



బస్సాసురుడి రథంకింద ఎవరైనా పడి నలిగిపోగానే అక్కడికి ప్రత్యక్షమై కష్టపడి కన్నీళ్ళు కార్చి, గుండెలు బాదుకొని "ఇలా ప్రజలు ప్రాణాలు తీసేది ఇంకా ఎన్నాళ్ళు? ముంచేస్తుంది నీ రథాన్ని మున్నీరై మా కన్నీళ్ళు" అంటూ కవిత్వాలు చెప్పుకోడం మొదలు పెట్టారు.

ప్రతిరోజు బస్సాసురుడి రథంకింద ఎవరో ఒకరు పడి ప్రాణాలు పోగొట్టుకోకపోతే ప్రజలకి, పత్రికలవాళ్ళకి, నాయకులకి, రక్షక భటులకి ఏమీ తోచక పిచ్చెక్కినట్టయ్యేది.

ఈ పరిస్థితి చూసి సహించలేక "పాదచారి" అనే సామాన్య మానవుడు హిమాలయాల్లోకి పోయి పరమ శివునికోసం ఘోరమైన తపస్సు ప్రారంభించాడు.

కొన్నేళ్ళకి పరమశివుడు "పాదచారి" భక్తికి మెచ్చి ప్రత్యక్షమయ్యాడు.

"పరమేశ్వరా! పాహిమాం! పాహిమాం!. భూభారాన్ని తగ్గించడంకోసం శ్రీమన్నారాయణుడు బస్సాసురుడికి రథాన్ని ఇచ్చాడు. సదరు రథం క్రిందపడి నలిగి అనేక మంది అమాయకులు రోజూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇలాగైతే కొన్నాళ్ళకి భూమి తన భారాన్ని కూడా కోల్పోయి బంతిలా అంతరిక్షంలో తేలిపోతుంది. కాబట్టి వెంటనే ఆ బస్సాసురుడిని అడ్డుకునే వరాన్ని నాకు ప్రసాదించు దేవా" అని పాదచారి వేడుకున్నాడు.

వెంటనే పరమేశ్వరుడు ఒక పుస్తకాన్ని పాదచారికి ఇచ్చి "భవిష్యత్తు" అనే ఈ పుస్తకాన్ని తెరిచి నువ్వు విద్యార్థివై ఎవర్ని ఎదిరించినా నిన్ను కాదనలేరు. వెళ్ళి బస్సాసురుడి అక్రమాల్ని అరికట్టు" అని దీవించి అంతర్ధానమైపోయాడు పరమశివుడు.

పుస్తకాన్ని చేత పట్టుకుని పాదచారి బస్సాసురుడి రథానికి అడ్డంగా వెళ్ళాడు. కానీ బస్సాసురుడు అతడ్ని ఏం చెయ్యలేక రథాన్ని వదిలేసి విష్ణుమూర్తి దగ్గరకి పరిగెట్టుకు పారిపోయి తనకి ఆయన ఇచ్చిన వరం చెల్లుతుందా లేదా అని నిలేసి అడిగాడు.

"న్యాయశాస్త్ర ప్రకారం నీ వరం చెల్లుతుంది" అని విష్ణుమూర్తి తీర్పు ఇచ్చాడు.

బస్సాసురుడు తిరిగివచ్చి పాదచారి పక్కనుండి రథాన్ని నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

బస్సాసురుడి రథం తిరగనివ్వడం అన్యాయం అని నాయకులు అరవబోయారు.

"మీ పదవులు మీరు వదిలేస్తే నా రథాన్ని నేనూ వదిలేస్తాను" అన్నాడు బస్సాసురుడు.

నాయకులు పదవుల్ని పట్టుకుని వేళ్ళాడుతూ బస్సాసురుడి రథాన్ని తిరగనివ్వనిచ్చారు.

పాదచారి మళ్ళీ బస్సాసురుడి రథానికి ఎదురువెళ్ళి తన చేతులో పుస్తకాన్ని తెరవబోయాడు ఇంతలో నారదుడు ప్రత్యక్షమై "నాయనా పాదచారీ! పుస్తకపాణీ! దయచేసి నువ్వు శివుడికి, విష్ణుమూర్తికి పోటీ పెట్టకు. పాదచారి అయిన నీ చావు ఎలాగా ఏదో ఒక రథం కింద రాసి వుంది. కాబట్టి అదుగో ఆ....జాతీయ బస్సుండి రథం కింద పడు. నీ దేశభక్తిని చాటి కీర్తిశేషుడవు కమ్ము" అని చెప్పి కొత్తగా బ్రహ్మ సృష్టించిన జాతీయ బస్సుండి రథాన్ని చూపించి పుస్తకాన్ని మూయించాడు. మరికొన్ని ప్రాణాలు బలి అయిపోయినా కథని సుఖాంతం చేశాడు.

[అంకితం :- విశాఖలో సిటీబస్సులు తిరగడంకోసం విశ్వవిద్యాలయాన్ని మూసేసిన సదరు అధికారులకి ఇది భక్తితో అంకితం]

—తంబు